క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వీరులపాడు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ రమావత్ కోటి తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలోని మంచి నీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేయించటంతో పాటు ప్రధాన రహదారులకు ఇరు పక్కలా బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా డ్రెయిన్‌లు, ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాల్లో మందు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

వీరులపాడు: మండలంలోని అల్లూరు గ్రామంలో ఈ నెల 10న గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సుమారు రూ. లక్ష విలువ చేసే వస్తువులు చోరీ చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ మహాలక్ష్మణుడు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన నవులూరు నాగేశ్వరరావు ఈ నెల తొమ్మిదిన హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి 18న వచ్చాడన్నారు. ఇంటికి తిరిగి వచ్చే సరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నల్లపూసల తాడుతో పాటు మరికొన్ని వెండి వస్తువులు కనిపించటం లేదని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

3న క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన వచ్చే నెల 3వ తేదీన బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక జిల్లా – ఒక ఉత్పత్తి – ఒక క్లస్టర్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో జిల్లా నుంచి కనీసం 20 మంది, గరిష్ఠంగా 100 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఒక క్లస్టర్ ను స్థాపిస్తామన్నారు. తద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసి, వారికి కావలసిన నైపుణ్యత, సాంకేతిక, మార్కెటింగ్ సహకారం అందిస్తామని చెప్పారు. ఈ క్లస్టర్‌కు రూ.5 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తామన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు పొదుపు సంఘాలు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలతో పాటు స్టార్టప్ కంపెనీలు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా కానీ 79959 15450, 63059 41717 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సదవకాశాన్ని రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

21న ఉచిత వైద్యశిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రకాష్‌నగర్ సెంటర్ లహరి విద్యామందిర్‌లో ప్రజారోగ్య వేదిక, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 21వ తేదీ ఆదివారం ఉచిత హెల్తీ రెగ్యులర్ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు హెల్తీ విజయవాడ మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ జి.విజయ్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ నేతృత్వంలో సుగర్, బీపీ, ఫిట్స్(మూర్ఛ) పక్షవాతానికి వైద్యశిబిరంలో చికిత్స అందిస్తారన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యేవారు వైద్య పరీక్షల వివరాలతో పాటు వాడుతున్న మందులను తీసుకురావాలని సూచించారు. వైద్యశిబిరంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను 200 రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులు అందిస్తామని తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 9.30 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

21న సిద్ధార్థలో గురు పౌర్ణమి వేడుకలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నగరంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి ఏ.కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ది బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా, విశిష్ట, ఆత్మీయ అతిథులుగా మాంటిస్సోరి కళాశాల సైకాలజీ అధ్యాపకుడు కోట కామేశ్వరరావు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ తెలుగు పండింట్ డాక్టర్ చెరువు రాజరాజేశ్వరి పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి కె.ఎల్.యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పైడిపాటి ఉమానాథశర్మ అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

విధులు బహిష్కరణ

తిరువూరు: జగ్గయ్యపేట కోర్టు వద్ద విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు గొట్టిక శివకృష్ణారెడ్డిపై దాడి ఘటనను నిరసిస్తూ గురువారం తిరువూరులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ



జగ్గయ్యపేటలో హెల్మెట్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు కె.శ్రావణి, శోభారాణి

జగ్గయ్యపేట అర్బన్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి సూచించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీ కోర్టు వద్ద నుంచి పాత మున్సిపల్ కార్యాలయం కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తలకు తగిలిన గాయాల వలన మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో జరిగే మరణాల వలన వారితో పాటు వారిమీద ఆధారపడిన కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లు ధరించి సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ టీఎల్ నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపాగ సుందరరావు, డి.సంతోష్, ప్యానల్ న్యాయవాదులు ఎం.విజయకుమారి, కె.శ్రీనివాసరావు, డి.నాగేశ్వరరావు, న్యాయవాదులు బి.జోగేంద్రకుమార్, ఎ.వరప్రసాదరావు, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాసవి, అమ్ములు, శేషకుమారి, పారాలీగల్ వాలంటీర్లు , జగ్గయ్యపేట, చిల్లకల్లు, వత్సవాయి పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. చివరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తున్న ద్విచక్రవాహనదారులను న్యాయమూర్తులు పూలతో అభినందించారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



నందిగామలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

నందిగామ టౌన్: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు హెల్మెట్ ధరించటంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది తలకు గాయమై మృత్యువాత పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించటం వల్ల ప్రమాద సమయాల్లో తలకు గాయం కాకుండా ఉంటుందని తెలిపారు. దీని వల్ల ప్రాణాలు కాపాడుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు విద్యాసాగర్, ఎస్‌ఐ పండుదొర, ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్, న్యాయవాదులు బొబ్బిళ్లపాటి భాస్కరరావు, షేక్ ఆజాద్, కొమ్మినేని మాలేశ్వరరావు, హనుమంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



పేటలో హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహనదారులను అభినందిస్తున్న న్యాయమూర్తులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం అభినందనీయం

విద్యార్థిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఢిల్లీలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో హ్యూజ్ పవర్ సేవింగ్ సిస్టం బై సోలార్ అనే అంశంపై నందిగామకు చెందిన మహ్మద్ సఫాన్ షాబాజ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించటం అభినందనీయమని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సఫాన్ షాబాజ్ గురువారం మాజీ ఎమ్మెల్యేను కలవగా ఆయన అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చటం హర్షణీయమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక విషయాలపై ఆసక్తి కనబర్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.



విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

సఫాన్ షాబాజ్ ఢిల్లీ స్థాయిలో నిర్వహించిన పోటీలో పాల్గొని ప్రతిభ చూపి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుని నందిగామకు సైతం మంచి పేరు తీసుకొచ్చారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి మహ్మద్ నూరుద్దీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సూక్ష్మ రుణాలు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ)లో గురువారం లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో పలువురు బోధ, కుష్టువ్యాధి గ్రస్తులకు సూక్ష్మ రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా మాట్లాడుతూ తెనాలికి చెందిన డబుల్ హార్స్ వారి ఆర్థిక సహకారంతో లెప్రా సొసైటీ వారి ద్వారా గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో 20 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున బోధ, కుష్టు వ్యాధిగ్రస్తులకు వారి వ్యాపారాభివృద్ధికై రూ.2 లక్షలు, జగ్గయ్యపేట పట్టణంలో ముగ్గురికి 30 వేల సూక్ష్మ రుణాల చెక్కులను ఆస్పత్రి సూపరిండెంట్ ఆళ్ల హరీష్ చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎం.రాధిక మాట్లాడుతూ తెనాలి డబుల్ హార్స్ సహకారంతో వ్యాధిగ్రస్తుల పిల్లల ఉన్నత విద్య నిమిత్తం ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే స్వయం సంరక్షక శిబిరాలు ఏర్పాటుచేసి వారికి మందులు, చెప్పులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సూపరిండెంట్ హరీష్ తెనాలి డబుల్ హార్స్ వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ అసిస్టెంట్ రాజశేఖర్, అవుట్ రిచ్ వర్కర్లు విజయకుమారి, లక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ హరీష్, లెప్రా సొసైటీ ప్రతినిధులు

గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం అన్నివేళలా అండగా ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్ నందు గురువారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సభ్యత్వం కల్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన ఎన్జీవో సంఘంలో వార్డు సచివాలయ ఉద్యోగులు నేటి నుంచి సభ్యులుగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. తమ సంఘంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కుటుంబంలో సభ్యులుగానే తాము భావిస్తున్నామని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఇకపై తాము కూడా పోరాటం చేస్తామన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబు, నగర శాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, నాయకులు నజీరుద్దీన్, రాజశేఖర్, వి.వి. ప్రసాద్, శ్రీనివాసరావు, శివలీల, శ్రీనివాస్, షేక్ ఖాసిం, కె.శివశంకర్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె.గోపయ్య, మెహబూబ్, వి.సుజాత, సూర్యప్రభ, ఉద్యోగులు పాల్గొన్నారు.



గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సభ్యత్వం ఇస్తున్న విద్యాసాగర్, నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామాజిక వేడుకలు



పెనుగంచిప్రోలు: సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామాజిక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు రిజిస్ట్రేషన్ గురించి, పోషకాహారం, గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ కేంద్రాల్లో అన్నప్రాసన, సంసిద్ధత, ప్రజారోగ్యంపై వివరించారు. గర్భిణులకు పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

నేడు ఆలయ పాలకవర్గ సమావేశం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులతో పాటు అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేసిన మారెపోగు మోహనరావు ఈ ఏడాది మార్చి 28వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీని నిమిత్తం యాక్సిస్ బ్యాంక్ నుంచి మంజూరైన రూ.64 లక్షల బీమా చెక్కును పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మృతుడి కుటుంబ సభ్యులకు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, కార్యాలయ ఏవో రంగారావు, ఏఆర్ ఏసీపీ కృష్ణంరాజు, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగిని, యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది మురళి, ప్రదీప్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పించిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గురువారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. విజయవాడతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, భక్త బృందాలు, భజన బృందాలతో పాటు సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు అమ్మవారికి సారెను సమర్పించాయి. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని అమ్మవారిని దర్శించుకున అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు.

చిట్టినగర్ నుంచి..

వైఎస్సార్ సీపీ 48వ డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో ఆషాఢ సారెను సమర్పించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్ నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.



ఊరేగింపులో పాల్గొన్న నగర మేయర్ భాగ్యలక్ష్మి

ఊరేగింపులో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, పెదబాబు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. సారె సమర్పించిన వారిలో పలువురు స్థానిక పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి పంచామృతాలతో అభిషేకాల అనంతరం విశేష అలంకరణ, పూజలను ఆలయ అర్చకులు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వర శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞ నారాయణమూర్తి పాల్గొన్నారు.

21న అమ్మవారికి శాకంబరి అలంకరణ

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మతో పాటు ఆలయంలోని సహదేవతలకు ఈ నెల 21న శాకంబరీ అలంకరణ చేయనున్నట్లు ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉంటే అదే రోజు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు బలి

కంచికచర్ల: యువత మత్తు పదార్థాలను వినియోగించటం వల్ల ఆనందమైన నిండు జీవితం బలి అవుతుందని ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాలను అరికడదాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత దేశానికి పనికొచ్చే విధంగా నడుచుకోవాలని తెలిపారు. దేశరక్షణ కోసం పాటుపడాలని పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్ చేస్తున్నారని ఇవి చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, మన మైండ్ మన కంట్రోల్‌లో ఉండదని తెలిపారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టాన్ని తెలియజేసేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత మత్తు పదార్థాలు, అసభ్యకరమైన సినిమాలు, ఇంటర్నెట్ వంటి వాటికి ఆకర్షితులయి అందమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి నిండు జీవితాలను బలిచేసుకోవద్దని హితవు పలికారు. మాదక ద్రవ్యాలను అరికడదామని, బంగారు భవిష్యత్‌కు మంచి పునాది వేసుకుందామని పేర్కొన్నారు. ఎస్‌ఐ ఎస్. కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలబారిన పడకుండా చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే డ్రగ్స్ నియంత్రణకు ఎస్ఈబీ, పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుటుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ పి.చిరంజీవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ డాక్టర్ ఎం.శ్రీదేవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ

అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. మండలంలోని వెల్లంకి నుంచి జుజ్జూరు గ్రామానికి వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ రూ. 70 లక్షలతో జుజ్జూరు–వెల్లంకి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్, దాములూరి మదుసూదనరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అధికారులు సమష్టిగా పని చేయాలి

నందిగామ టౌన్: రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉన్న కొద్ది వనరులతో అధికారుల సమష్టి కృషితో జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి గురువారం నియోజకవర్గంలోని అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడేతూ సమస్యలపై అధికారులతో చర్చించేందుకే సమావేశం నిర్వహించామని చెప్పారు. అధికారులు సమష్టి కృషితో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్

జగ్గయ్యపేట క్రీడాకారుల ప్రతిభ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో ఉన్న ఏసీఏ, కేడీసీఏ బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు టి.వరుణ్ సాత్విక్, ఎస్.రాజేష్ అండర్–19అంతర్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా ఈనెల 17 నుంచి కడప ఏసీఏ అండర్–19 అంతర్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు 50 ఓవర్లు ఆడి 247 పరుగులు చేయగా, కడప జిల్లా జట్టు 50 ఓవర్లు ఆడి 190 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ వన్‌డే మ్యాచ్‌లో కృష్ణా జిల్లా 57 పరుగుల తేడాతో గెలుపొందింది. కెప్టెన్‌గా వ్యవహరించిన టి.వరుణ్‌సాత్విక్ 106 పరుగులు చేయగా, బౌలింగ్‌లో ఎస్.రాజేష్ 4 వికెట్లు తీశాడు. వీరిద్దరూ కృష్ణా జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించినట్లు జగ్గయ్యపేటకు చెందిన ఏసీఏ, కేడీసీఏ బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీ కోచ్ రాజేంద్ర తెలిపారు.



106 పరుగులు చేసిన కెప్టెన్ వరుణ్ సాత్విక్



4 వికెట్లు తీసిన కృష్ణా జట్టు బౌలర్ రాజేష్

పాండురంగస్వామికి తులసీ దళార్చన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం(కొత్త గుళ్లు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామికి గురువారం లక్షతులసీదళార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం విష్ణు సహస్రనామ సహిత లక్ష తులసీ దళార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. సహస్ర దీపాలంకరణను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణం దీపపు కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. అనంతరం స్వామి వారి పవళింపు సేవను శాస్త్రోక్తంగా జరిపారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు పులిపాక రాఘవాచార్యులు ఆంజనేయాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణచార్యులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు.



విశేష అలంకరణలో స్వామి వారు

జాబ్ ఫెస్ట్‌లో 39 మంది ఉద్యోగాలకు ఎంపిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్ ఫెస్ట్‌లో 39 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దివీస్ ల్యాబ్స్ కంపెనీ వారు ఇంటర్వ్యూలు నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తం 200 మంది విద్యార్థులు జాబ్‌ఫెస్ట్‌కు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన 39 మంది విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్య పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జేకేసీ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ జి.విజయ్ దీప్, కళాశాల అధ్యాపకులు కె.వి.ఎస్ ప్రసాద్, షేక్ బీబీ, పి.సురేష్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.